నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, శనివారం 3 ఫిబ్రవరి 2024 NALGONDA

## పద్మశ్రీ కూరెళ్లకు 4న సర్కారు సత్కారం



కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, ఫిబ్రవరి 2 : పద్మవిభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో సత్కరించనున్నది. అందులో భాగంగా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన ప్రముఖ సాహితీవేత్త, కవి కూరెళ్ల విఠలాచార్యను సత్కరించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆయనను ఫోన్‌లో ఆహ్వానించినట్లు కూరెళ్ల గ్రంథాలయ పాలకుడు తాటిపాముల స్వామి తెలిపారు.

## బాలల రక్షణకు నిరంతర తనిఖీలు

**ఆపరేషన్ స్మైల్‌లో 182మంది బాలల గుర్తింపు**

**సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే**

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 2 : బాలల రక్షణకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, వెట్టి చాకిరీకి గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. జిల్లా పోలీసు, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, వైద్య తదితర శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జిల్లాలో నెల రోజులుగా పకడ్బందీగా నిర్వహించామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాధరణకు గురవుతున్న, వెట్టి చాకిరీలో మగ్గుతున్న 182 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించామని వివరించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలురు 85, బాలికలు 11మంది ఉన్నారని, ఇతర రాష్ట్రాలకు చెందిన బాలురు 65మంది, బాలికలు 21 మంది ఉన్నారని తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో లక్ష్యాన్ని చేరేలా సిబ్బంది అందరూ బాగా పని చేశారని కితాబిచ్చారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని, బాలలు చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వాలు ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్నాయని, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారా?

- రైతుల రుణమాఫీ ఎందుకు చేయలేదు
- 420 హామీలపై గ్రామాలు, తండాల్లో చర్చ పెట్టండి
- ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్‌ను నిలదీయండి
- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



దేవరకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, యాదాద్రి జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 2 : రైతుబంధు డబ్బులు పడలేదని అడిగితే చెప్పుతో కొడతారా? కాంగ్రెస్ నాయకులకు ఇంత అహంకారమా? ప్రజలు ఆలోచించాలి.. అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకు నామమాత్రంగా రెండు హామీలు అమలు చేసి కాలయాపన చేస్తుందన్నారు. ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. ఎస్సీ, ఎస్టీ, మహిళా తదితర డిక్లేరేషన్లతో కలిపి 420 హామీలని, అవి అమలు చేయకుంటే గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు నిలదీయాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైందని, ప్రస్తుతం 3, 4 గంటలే కరెంట్ ఉంటుందని ఆరోపించారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు ఇవ్వలేని దీన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. చెప్పిన తేదీల్లో రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, మహిళలకు నెలకు రూ.2500 భృతి ఇస్తామని చెప్పి మాటిమాటికీ తెలంగాణలో నిధులు లేవనడం సరికాదని పేర్కొన్నారు. లంకబిందెలు దొరుకుతాయని అనుకుంటే, ఖాళీ బిందెలు దొరికాయని సీఎం చెప్పడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రతి మనిషీ అప్పు చేయడం సహజమని, అలాంటిది రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పు చేయడం తప్పా? అని ప్రశ్నించారు. హామీల అమలుపై దృష్టి పెట్టకుండా పదే పదే అప్పు అంటూ ఆరు గ్యారెంటీల అమలుకు కాలయాపన చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలకే వేల కోట్ల అప్పు తీసుకోలేదా? అని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమంలో నంబర్‌వన్‌గా మారిందన్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్లు రైతు సంతోషంగా పంటలు పండించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలలకే రైతుల బతుకులు ఆగమవుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో లోపాలను సవరించుకొని గులాబీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ సర్పంచులను సన్మానించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, వడ్త్యా రమేశ్‌నాయక్, ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, మాదవరం సునీత, జడ్పీటీసీ కంకణాల ప్రవీణ, టీవీఎన్ రెడ్డి, హన్మంత్ వెంకటేశ్‌గౌడ్, మరుపాల సురేశ్‌గౌడ్, సర్వయ్య, రాజినేని వెంకటేశ్వర్లు, చింతపల్లి సుభాశ్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, రమేశ్‌నాయక్, నేనావత్ శ్రీనునాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## కందికి ₹10,062

**సూర్యాపేట మార్కెట్‌లో అత్యధికంగా పలికిన ధర**

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 2 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో కందులకు మద్దతుకు మించి ధర పలుకుతున్నది. కొద్ది రోజులుగా క్వింటా కందులకు రూ.8వేల నుంచి 9వేల వరకు ధర పలుకుతుండగా.. శుక్రవారం అత్యధికంగా రూ.10,062 పలికింది. సూర్యాపేట మార్కెట్‌కు ఐదుగురు రైతులు 11క్వింటాళ్ల కందులను తీసుకురాగా క్వింటా ధర గరిష్ఠంగా రూ.10,062, కనిష్ఠంగా 9,572 రూపాయలు పడింది. మార్కెట్‌లో నిత్యం పర్యవేక్షణ చేస్తూ కమీషన్‌దారులు, వ్యాపారులతో మాట్లాడి రైతులు తెచ్చిన పంటలకు మంచి ధర అందేలా చూస్తున్నామని మార్కెట్ కార్యదర్శి రాహుల్ తెలిపారు.

# భువనగిరి ఖిలాపై ఎగిరేది గులాబీ జెండానే..

- అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా మేము ప్రజల పక్షమే
- ఇది స్పీడ్ బ్రేకరే.. కారు మళ్లీ స్పీడందుకుంటుంది
- గెలుపోటములు సహజం.. కార్యకర్తలు అధైర్యపడొద్దు
- అందరం కలిసి పనిచేస్తే భవిష్యత్ మనదే
- సమస్యలపై కొట్లాడుదాం.. సర్కారు తప్పిదాలను ఎండగడుదాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- కేసీఆర్‌ను టచ్ చేయండి చూద్దాం..
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- భువనగిరిలో బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, వేదికపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : 'భయపడాల్సిన అవసరం లేదు.. భవిష్యత్ మనదే. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై ఎగిరిగేది బీఆర్ఎస్ జెండానే. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా మనం ప్రజల పక్షమే.' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఓటమి శాశ్వతం కాదు.. గెలుపునకు నాంది అని పేర్కొన్నారు. ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, బ్రేక్ తర్వాత కారు స్పీడ్ పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. మనం అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం కోసం పని చేశామని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ప్రజల కోసమే కొట్లాడుదామని చెప్పారు. భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం పార్టీ భువనగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. బీఆర్ఎస్ ఓడిపోయినా, సభలో పట్టనంత మంది రావడం మన బలానికి చిహ్నమన్నారు.

ప్రచారంలో అబద్ధాలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చాక అసహనం పెరిగిందని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని ఆ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రైతుబంధు పడటంలేదని జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి అడిగితే ఆయనను పోలీసులతో బయటకు పంపించారని గుర్తుచేశారు. అధికారం ఉన్నదని తమ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులపై కేసులు పెట్టడం, నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం గొప్పదనం కాదన్నారు. ఎన్నికల్లో అన్నీ అబద్ధాలు చెప్పారని, కనీసం పాలనలోనైనా నిజాయితీ చూపించాలని హితవు పలికారు.

### కార్యకర్తల వెన్నంటి ఉంటాం

బీజేపీని ఎదిరించే శక్తి ఒక్క బీఆర్ఎస్‌కే ఉన్నదని, తెలంగాణ హక్కులను కాపాడేది బీఆర్ఎస్ పార్టీనేనని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ సొంత ప్రయోజనాల కోసం పని చేస్తుందని, బీఆర్ఎస్ మాత్రం తెలంగాణ కోసం పని చేస్తుందని చెప్పారు. అందరం రామ భక్తులమేనని, బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను లాక్కెళ్లిందని, లోయర్ సీలేరును గుంజుకున్నదని మండిపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అన్నారు. గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడవద్దని సూచించారు. కాంగ్రెస్ కేసులు పెట్టినా, వేధించినా పార్టీ వెన్నంటి ఉంటుందని భరోసా కల్పించారు. అందరం కలిసి పనిచేస్తే భవిష్యత్ మనదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరికీ పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ 420 హామీలపై గ్రామాలు, తండాల్లో చర్చలు పెట్టాలని, ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు, ప్రజా సమస్యలపై కొట్లాడుదామని, సర్కారు తప్పిదాలను ఎండగడుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నాయకులు జడల అమరేందర్, అమరేందర్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### కేసీఆర్‌ను టచ్ చేయండి చూద్దాం..

**– మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



బీఆర్ఎస్‌ను బొంద పెడ్తామని, జైళ్లో వేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారు.. కేసీఆర్‌ను అది చేస్తాం.. ఇది చేస్తామని అంటున్న వారు ఒక్కసారి ముట్టుకొని చూడాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు. ఉద్యమాల నుంచి వచ్చిన తమకు జైళ్లు కొత్తేం కాదని, అక్కడికి వెళ్తే తమకు సెల్యూట్ కొడుతారని అన్నారు. అధికారం ఉన్నదని విర్రవీగితే బాగుండదని హెచ్చరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి గట్టిగానే సమాధానం ఇచ్చారన్నారు. నల్లగొండకు కోమటిరెడ్డి ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటమి సహజమని, ప్రజలు ఒక్కోసారి అబద్ధాలను నమ్మి అపోహ పడుతారని అన్నారు. ఓటమిని కార్యకర్తలపై వేయొద్దని, నాడు పార్టీ కార్యకర్తలే 30వేల మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. భువనగిరిలో ఎంతో అభివృద్ధి జరిగినా ఓడామని, ఇప్పుడు ప్రజలే ఎందుకు ఓడించామా? అనే బాధలో ఉన్నారని వివరించారు. తెలంగాణ ఉద్యమం కంటే ప్రభుత్వంలోనే ఎక్కువగా పని చేశామన్నారు. 420 నాయకుల మాటలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు.

## గుట్టలో వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం



అష్టోత్తర శత ఘటాభిషేకంలో భాగంగా కలశాలను తీసుకొస్తున్న ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీ నరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు అనుబంధ పాతగుట్ట ఆలయంలో శుక్రవారం స్వాతి నక్షత్రపు పూజలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వైభంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో శత కలశాలను ఏర్పాటు చేసి శుద్ధ జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసింహస్వామివారిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలు నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నరపాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి, దర్బార్ సేవలతోపాటు ఊంజల్ సేవ నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు చేశారు. స్వామివారిని సుమారు 9 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.21,73,256 ఆదాయం సమకూరిందని ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

- గ్యారెంటీలపై చేతులు ఎత్తేసిన కాంగ్రెస్
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షించుకుందాం..
- 4న నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడ, ఫిబ్రవరి 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టి కృషితో సత్తా చాటుదామని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టింది ముఖ్యమంత్రి కేసీఆరే అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుదామన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ చేతులెత్తేసిందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు, ఆరు గ్యారెంటీలు అమలు చేసేది లేదని పేర్కొన్నారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా ఉమ్మడి జిల్లాకు సాగునీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు తరలించడంపై జిల్లా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇండియా కూటమి నుంచి ముఖ్యమైన పార్టీలు నిష్క్రమించాయని గుర్తు చేశారు. ప్రజల సమస్యలపై పోరాడే వారికే భవిష్యత్ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఓటమిపై సమీక్ష జరుపుకుందామన్నారు. తప్పొప్పులు సరి చేసుకొని ప్రజల పక్షాన నిలబడుదామన్నారు. త్వరలో జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఫిబ్రవరి 4న గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు జరిగే నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పట్టణంలోని 18వ వార్డు కు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మాధవిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## ఘనంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నల్లగొండలో కేక్ కట్ చేస్తున్న జడ్పీచైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు

- నల్లగొండలోని గుత్తా నివాసంలో కేక్ కటింగ్.. రక్తదానం
- పాల్గొన్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 2 : శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్‌రెడ్డితోపాటు పలువురు రక్తదానం చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులు, సహాయకులకు అల్పాహారం అందజేశారు.

అనంతరం జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుఖేందర్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండి ప్రజాసేవలో భాగమైన వ్యక్తి అన్నారు. ఆయన శ్వాస, ధ్యాస మొత్తం ప్రజలే అన్నారు. ఆయన దారిలోనే కుమారుడు అమిత్‌రెడ్డి నడుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కనగల్ ఎంపీపీ కరీం పాషా, జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, కౌన్సిలర్లు యామ కవితాదయాకర్, అభిమన్యు శ్రీనివాస్, నాయకులు మాలె శరణ్యారెడ్డి, అయితగోని స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, ముక్తదర్, హన్ను, సహదేవ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, రజితావెంకట్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నర్సిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, జమాల్ ఖాద్రి, శ్రీనివాస్, మొయిజ్, మల్లయ్య, సైదులు పాల్గొన్నారు. చిట్యాలలో గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గుత్తా అమిత్‌రెడ్డి స్థానిక కనకదుర్గ ఆలయంలో సుఖేందర్‌రెడ్డి పేరున పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. యాద్గార్‌పల్లి, జంకుతండాలో జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గుర్రంపోడులో ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, చందంపేటలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య ఆధ్వర్యంలో గుత్తా జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## బహిరంగ మార్కెట్‌లో రేషన్ బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జనవరి 2 : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా, ఎవరైనా కొన్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పౌర సరఫరాల శాఖ డీటీలు, గోదామ్ ఇన్‌చార్జీలు, రేషన్ డీలర్ల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపు ముందు ప్రభుత్వ చౌక ధరల దుకాణం బోర్డు కలిగి ఉండాలన్నారు. డీలర్లు సమయ పాలన పాటించాలని, రేషన్ షాపును తెరిచి ఉంచి, బియ్యం సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. డీలర్లందరూ ఆథరైజేషన్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలు ప్రతి నెలా 10వ తేదీ లోగా రేషన్ బియ్యం షాపులకు చేరుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 13,93,630 యూనిట్లు ఈ–కేవైసీ చేయవలసి ఉండగా.. ఇప్పటి వరకు 9,68,698 (69.51%) పూర్తయిందని తెలిపారు. ఇంకా 4,24,932 కార్డుదారులు ఈ–కేవైసీ చేయాల్సి ఉన్నదని తెలిపారు. డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని ఈ నెలాఖరులోగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.